క్లుప్తంగా

శ్రీశైలం, సోమశిలలో మండల శివదీక్ష స్వీకరణ



కందనూలు: శ్రీశైలం దేవస్థానంలో శ్రీశైల దేవస్థాన ఆలయప్రధాన అర్చకులు స్వామి సన్నిధిలో ఆదివారం మండల శివదీక్ష మాల స్వీకరణ చేశారు. ప్రాచీన శివాలయం సోమశిలలో మండల శివదీక్ష గురుస్వామి గుంపుల విజయకుమార్ ఆధ్వర్యంలో మాలధారణ చేపట్టారు. కార్యక్రమంలో గురుస్వాములు కొండకింది మాధవరెడ్డిస్వామి, బొజ్జయ్యస్వామి, మూర్తిస్వామి, ఇతర స్వాములు పాల్గొన్నారు.
బిజినేపల్లి: మండలంలోని లట్టుపల్లిలో సిద్ధయ్య గురుస్వామి సమక్షంలో గ్రామానికి చెందిన 300 మంది యువత మండల శివదీక్ష మాలను ఆదివారం స్వీకరించారు. గంగారం, వెల్గొండ, మంగనూర్ తదితర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని యువతకు శివదీక్ష మాలాధారణ చేయించారు. శివాలయంలో శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్థికసాయం అందజేత



కోడేరు: మండల కేంద్రానికి చెందిన మనెమోని వెంకటస్వామి అనారోగ్యంతో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు దూరెడ్డి సురేందర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డిలు పరామర్శించి రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో వడ్డె రామలక్ష్మణ్, ఆంజనేయులు, సుబ్బయ్య, రాంబాబు, మాజీ వార్డు సభ్యులు రాములు, వెంకటస్వామి, శ్రీను పాల్గొన్నారు.

23న ఈదమ్మ జాతర తైబజార్ వేలం

కొల్లాపూర్: ఈదమ్మ జాతర తైబజార్ వేలం పాట ఈనెల 23 వతేదీన ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు కమిషనర్ శ్రీనివాసన్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో పాల్గొనే వారు 20వ తేదీ నుంచి 22వ తేదీ సాయంకాలం వరకు మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. తైబజార్ వేలం కోసం రూ.3 లక్షల డిపాజిట్‌తో పాటు ఈఎండీ కింద రూ.10 వేలు చెల్లించాలని కోరారు. వేలం దక్కిన వారు 23 వతేదీ సాయంకాలం 5 గంటల లోగా పూర్తి డబ్బులు చెల్లించాలని, లేనిపక్షంలో రెండో విడత వేలం నిర్వహిస్తామని వివరించారు.

ముగిసిన ఉర్సు

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని ఖాదర్‌పాషా దర్గా ఉర్సు ఉత్సవాలు ముగిశాయి. మూడురోజుల పాటు నిర్వహించిన ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. దర్గాలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. సహకరించిన భక్తులకు జామెమజీద్ కమిటీ అధ్యక్షుడు ఖాజాచావుష్ ధన్యవాదాలు తెలిపారు.

10న చలో ఢిల్లీ

తిమ్మాజిపేట: దివ్యాంగుల సమస్యల సాధన కోసం వచ్చే నెల ఫిబ్రవరి 10న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కుర్మయ్య తెలిపారు. మండల కేంద్రం తిమ్మాజిపేటలో ఆదివారం చలో ఢిల్లీ వాల్ పోస్టర్‌ను దివ్యాంగులతో కలిసి ఆయన విడుదల చేశారు. దివ్యాంగుల పింఛన్ రూ. 10 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో భీమయ్య, రాములు, రమేష్, రజిత, వెంకటయ్య పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

పాన్‌గల్: సంక్షేమ పథకాల అమలు కోసం సర్వేలో గుర్తించిన లబ్ధిదారుల వివరాలను మంగళవారం నుంచి నిర్వహించనున్న గ్రామ సభల ద్వారా ప్రకటించి ఆమోదం తెలుపుతారని ఎంపీడీఓ గోవింద్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఈనెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తారన్నారు. 21వ తేదీన అన్నారం, అన్నారంతండా, బహుదూర్‌గూడెం, బండపల్లి, బుసిరెడ్డిపల్లి, దావాజిపల్లి, దొండాయిపల్లి, కదిరెపాడు, శాగాపూర్‌తండా, తెల్లరాళ్లపల్లి 22వ తేదీన చింతకుంట, కిష్టాపూర్‌తండా, కొత్తపేట, మాధరావుపల్లి, మల్లాయిపల్లి, రేమద్దుల, వెంగళాయిపల్లి, 23వ తేదీన చిక్కేపల్లి, దావాత్‌ఖాన్‌పల్లి, గోప్లాపూర్, జమ్మాపూర్, మాందాపూర్, మంగళ్లపల్లి, పాన్‌గల్, రాయినిపల్లి, శాగాపూర్, 24వ తేదీన కేతేపల్లి, తెల్లరాళ్లపల్లితండాలో నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

తాడూరు: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేవిధంగా చూడాలని అదనపు కలెక్టర్ పి అమరేందర్ అధికారులను ఆదేశించారు. ఆదివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా అయన తహసీల్దార్ కిరణ్మయి, ఆర్ సల్మాన్‌లను సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. నిజమైన లబ్ధిదారులు గుర్తించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతు భరోసాను పరిశీలించిన ఆర్డీఓ

పెద్దకొత్తపల్లి: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో రైతుభరోసా సర్వేపై కొల్లాపూర్ ఆర్డీఓ బన్సీలాల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. వ్యవసాయ యోగ్యం కాని భూములను తొలగించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జేకే మోహన్, ఎంపీడీఓ నాగేందర్, డిప్యూటీ తహసీల్దార్ రమేష్ నాయక్, ఏఈఓ మూజీబ్, పంచాయతీ కార్యదర్శి నాగశేషు, సర్వేయర్ బాబు నాయక్, ఆర్ఐ శివకుమార్‌లు పాల్గొన్నారు.

ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ

చారకొండ: మండలంలోని మర్రిపల్లిలో సర్వేను కల్వకుర్తి ఆర్డీఓ శ్రీను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. సాగు లేని భూములు వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ భరత్, ఏఈఓ అనూష తదితరులు ఉన్నారు.

పారదర్శకంగా చేపట్టాలి

తెలకపల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా చేపట్టాలని ఆర్డీఓ సురేష్ అన్నారు. మండలంలోని పెద్దూరు, గడ్డంపల్లి, బొప్పల్లి, లక్నారం గ్రామాల్లో సర్వే కొనసాగింది. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాంలాల్, తహసీల్దార్ జాకీర్ అలీ, ఆర్ఐ శ్రీనివాసులు, ఎంపీఓ వెంకటయ్య, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ నర్మద, ఏఈఓ జోత్స్న, పంచాయతీ కార్యదర్శి ఈశ్వర్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సర్వే పరిశీలన

కొల్లాపూర్: వరిదేల, చౌటబెట్ల శివార్లలో గల భూములను మండల వ్యవసాయ అధికారి హుస్సేన్ యాదవ్, ఏఈఓ సూర్యతేజ పరిశీలించారు. పలు రియల్ ఎస్టేట్ వెంచర్లు, చిన్నతరహా పరిశ్రమలు ఏర్పాటుచేసిన భూములను వారు తనిఖీలు చేశారు.
కొల్లాపూర్ రూరల్: మండలంలోని చౌటబెట్ల, వరిదేల గ్రామాల్లో నాయబ్ తహసీల్దార్ రాజ్‌కుమార్ రెవెన్యూ అధికారులతో కలిసి సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సర్వేయర్లు, వ్యవసాయ విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

రైతులతో సమావేశం

పెద్దకొత్తపల్లి: రైతు భరోసా సర్వే కార్యక్రమంపై మరికల్‌లో అధికారలు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఐ శివకుమార్ మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి రైతు భరోసా అందిస్తామన్నారు. సర్వేయర్ బాబు, ఈశ్వర్, నరసింహ, అశోక్, కోటయ్య, లచ్చగౌడ్ పాల్గొన్నారు.



తాడూరులో సర్వే వివరాలు అడిగి తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ అమరేందర్



కొల్లాపూర్ మండలం వరిదేలలో..



చారకొండలో మర్రిపల్లిలో



పెద్దకొత్తపల్లి మండలం మరికల్‌లో

పేదలకు అండగా ఉంటాం

వెల్దండ: పేదలకు ఐక్యతా ఫౌండేషన్ అండగా ఉంటుందని టాస్క్ సీఓఓ, ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని కుప్పగండ్లలో రూ.3 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌రెడ్డి, రమేష్‌ముదిరాజ్, దామోదర్‌రెడ్డి, చెన్నయ్యగౌడు, శ్రీనుసాగర్, రమేష్‌యాదవ్, ప్రభాకర్, రమేష్, శివరాజ్‌గౌడు, రమేష్‌గౌడు, శ్రీధర్, జంగయ్య, గణేష్, మహేష్ ముదిరాజ్, బాలరాజు, మురళీ ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తా

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని హనుమాన్ నగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న మాత పోచమ్మ దేవాలయ నిర్మాణానికి సహకరిస్తానని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆయన నిర్మాణం పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పలు విషయాలను రాఘవేందర్ రెడ్డికి వివరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీశైలం, మాజీ కౌన్సిలర్ జగదీష్, శాలివాహన సంఘం అధ్యక్షుడు నరసింహ, రాజశేఖర్, శ్రీనివాసులు, బాలసాయిలు, లక్ష్మయ్య, హరీష్, మహేష్ శాలివాహన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కల్వకుర్తి రూరల్: మండలంలోని మార్చాలా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 2004-2005వ సంవత్సరం చెందిన పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకొని ఉద్యోగ, కుటుంబ వివరాలను అడిగి తెలుసుకున్నారు. సందర్భంగా అప్పటి గురువులను సన్మానించారు.

ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలి

అచ్చంపేట రూరల్: ప్రతి ఒక్కరూ సేవాభావం అలవర్చుకోవాలని లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోక్తాల వెంకటేష్ అన్నారు. ఆదివారం పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ అచ్చంపేట, హరిహర డెంటల్, పాలిక్లినిక్ సౌజన్యంతో ఉచిత దంత వైద్య, శస్త్ర చికిత్సా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణనాయక్ 160 మంది రోగులకు దంత పరీక్షలు చేశారు. అవసరమైన వారికి దంతాలు తొలగించడం, శుభ్రం చేయడం తదితర చికిత్సలు చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, శివశంకర్, నర్సింహారావు, యూఎల్ చారి, నరేష్, బాలాజీ, వెంకటరమణ పాల్గొన్నారు.



పరీక్షిస్తున్న వైద్యురాలు

ఎల్క శ్రీనుకు నివాళి

చారకొండ: కార్మికుల నాయకుడు ఎల్క శ్రీను సేవలు మరువలేనివని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు అన్నారు. మండలంలోని జూపల్లిలో ఎల్క శ్రీను దశదిన కర్మను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన హాజరై నివాళులర్పించారు. జిల్లా నాయకులు అంజనేయులు, మండల కార్యదర్శి బాలస్వామి, మాజీ వైస్ ఎంపీపీ వెంకటయ్య యాదవ్, భగత్‌సింగ్ యూత్ సభ్యులు, కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

సీపీఎం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి



తెల్లరాళ్లపల్లిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

పాన్‌గల్: సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈనెల 25 నుంచి 28 వరకు నిర్వహించే సీపీఎం రాష్ట్ర నాల్గో మహాసభలను జయప్రదం చేయాలని పార్టీ మండల కార్యదర్శి బాల్యనాయక్ కోరారు. ఆదివారం మండలంలోని తెల్లరాళ్లపల్లి గ్రామంలో మహాసభల వాల్‌పోస్టర్లను పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహాసభలో ప్రజలు, కూలీలు, రైతులు, కార్మికులు, ఉద్యోగులు, దళిత, గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటాలు కొనసాగిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రతి గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో పాల్గొని మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కృష్ణయ్య, శేఖర్ యాదవ్, చిన్నయ్య, సీఐటీయూ నాయకులు నాగయ్య, బాబునాయక్, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని రెడ్డి భవనంలో మండల రెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం ప్రజాకవి, సంఘ సంస్కర్త యోగి వేమన జయంతిని నిర్వహించారు. ఈసందర్భంగా ఆ సమితి నాయకులు వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సరళమైన మన యాస భాషలో అందరికీ అర్థమయ్యేరీతిలో పద్యాలు రచించి సేవలు అందించిన మహనీయుడు వేమన అని వక్తలు కొనియాడారు. రెడ్డి సేవాసమితి మండల అధ్యక్షుడు కట్టా జనార్దన్‌రెడ్డి, కొత్త చిన్న జంగిరెడ్డి, తుమ్మల శ్రీనివాస్‌రెడ్డి, కట్టా మల్లారెడ్డి, కొత్త అచ్యుతారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, సుమతి, సునీత, రామచంద్రమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న నాయకులు

వ్యక్తిపై కేసు నమోదు

వెల్దండ: ఈనెల 17న కోడేరు చెందిన పవన్‌కుమార్ హైదరాబాద్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వస్తుండగా మండల కేంద్ర సమీపంలో కేఎల్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో అకస్మాత్తుగా మళ్లడంతో అచ్చంపేట మండలం సింగారంతండాకు చెందిన పరమేష్ బైక్ వెనకనుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో సింగారంతండాకు చెందిన పరమేష్ నాయక్, బిచ్యాలికి గాయాలు కావడంతో హైదరాబాదులోని ఓవైసీ ఆస్పత్రికి తరలించారు. పరమేష్ నాయక్ ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ కురుమూర్తి తెలిపారు.

పాలెం అధ్యాపకురాలికి డాక్టరేట్



బిజినేపల్లి: గ్లోకల్ విశ్వ విద్యాలయం నుంచి పాలెం వేంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు రాధాకుమారికి డాక్టరేట్ గౌరవం దక్కింది. ఎగ్జామినింగ్ ఇండియనైజేషన్ ఆఫ్ ఇంగ్లీష్ ఇన్ సోషియోలింగ్విస్టిక్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచింగ్ అంశంపై చేసిన ప్రత్యేక పరిశోధనకు గాను ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని షహారాన్పూర్ పట్టణం గ్లోకల్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ అవినీష్ జునేజ ఆధ్వర్యంలో డాక్టరేట్‌కు ఎంపిక చేశారు. ఆదివారం యూనివర్శిటీ నుంచి వచ్చిన సర్టిఫికెట్‌ను పాలెం కళాశాల ప్రిన్సిపాల్ డా. పి.రాములు రాధాకుమారికి కళాశాలలో అందజేశారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

డీసీఎం బోల్తా: పలువురికి గాయాలు

ఉప్పునుంతల: యాదగిరిగుట్ట దైవదర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా ఆదివారం సాయంత్రం ఘట్‌కేసర్ వద్ద డీసీఎం అదుపుతప్పి బోల్తాపడి ఉప్పునుంతల మండల కేంద్రానికి చెందిన రేణుకతోపాటు దేవదారికుంట తండాకు చెందిన బొల్లె శ్రీను అతని భార్య సుజాత, తల్లి మశమ్మ, తండ్రి లక్ష్మయ్యలకు స్వల్పగాయాలయ్యాయి. ఉప్పునుంతలకు చెందిన కూతల శాంతమ్మ బాలయ్య కుటుంబం కొన్నేళ్లుగా హైదరాబాద్‌లో ఉంటూ కూలీ పనులు చేసుకుంటున్నారు. హైదరాబాద్ నుంచే డీసీఎంలో యాదగిరి గుట్టకు బయలుదేరారు. వారితోపాటు బంధువులైన దేవదారికుంట తండాకు చెందిన వారు కూడా రెండు రోజుల కిందట తండా నుంచి హైదరాబాద్ వెళ్లి వారితోపాటు యాదగిరిగుట్టకు డీసీఎంలో వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వాహనం అదుపు తప్పి శాంతమ్మ కూతురు రేణుకకు తలకు, గాయాలు కాగా మిగతా వారికి స్వల్ప గాయాలయినట్లు బంధువులు తెలిపారు.

నియోజకవర్గ అధ్యక్షుడిగా ఆంజనేయులు



వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన వరికుప్పల ఆంజనేయులును వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షుడిగా నియామకం అయ్యారు. ఆదివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిల్లమల్లు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు దండుగుల మల్లేశ్వరిలు హైదరాబాదులో నియామక ప్రతం అందజేశారు. గ్రామ గ్రామాన వడ్డెరలను ఏకం చేసి నూతన కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యులు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేష్, జిల్లా ఉపాధ్యక్షుడు డేరంగుల శ్రీను, కల్వకుర్తి మండల అధ్యక్షుడు గణేష్, పట్టణ అధ్యక్షురాలు శారద, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

యువకుడిపై దాడి: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: మద్యం మత్తులో అకారణంగా యువకుడిపై దాడి చేసిన ముగ్గురు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోవర్ధన్ ఆదివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన సందీప్ రాంనగర్‌కాలనీలోని శనివారం ఓరైస్‌మిల్ వద్దకు పొట్టుకోసం వెళ్లి మూత్ర విసర్జన చేస్తుండగా అక్కడే ఉన్న శేఖర్, సాయి, ప్రశాంత్‌లు మద్యం మత్తులో సందీప్‌పై దాడికి పాల్పడ్డారు. సందీప్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

- వసతులు, పరికరాలు కరువు
- పట్టించుకోని అధికారులు



వృథాగా కిట్లు



మండల కేంద్రంలో బోర్డుకే పరిమితమైన క్రీడామైదానం

తాడూరు: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్న ఉద్దేశ్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు నిరుపయోగంగా మారాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.లక్షలు వెచ్చించి క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. సరైన వసతులు కల్పించడంలో అధికారులు విఫలం అయ్యారని విమర్శలు వినిపిస్తున్నాయి. బోర్డులకే పరిమితి కావడంతో మైదానంలో పిచ్చిమొక్కలు పెరిగి అపరిశుభ్రంగా మారాయి. మరికొన్ని మైదానాలు గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేయడంతో క్రీడాకారులు ఆడేందుకు ఆసక్తి చూపడం లేదు. మండలంలో 24 గ్రామ పంచాయతీలకు గాను 20 గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. ఇందులో కొన్ని గ్రామాల్లో పనులు నిలిచిపోయాయి. మిగతా 4 గ్రామ పంచాయతీలలో స్థలాల కొరత ఏర్పడింది.

బోర్డులకే పరిమితం..

మండలంలోని ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల నిర్వహణ సంబంధిత అధికారులు గాలికి వదిలేశారు. అందరికి మైదానాలు అందుబాటులో లేకపోవడంతో వ్యాయామం చేసేందుకు ప్రజలు ఆసక్తి చూపడం లేదు. మరికొన్ని చోట్ల స్థలాలను గుర్తించిన పూర్తిస్థాయిలో ఉపకరణాలను ఏర్పాటు చేయలేదు. ఇంకొన్ని చోట్ల క్రీడా ప్రాంగణాలకు అసలు స్థలాలను గుర్తించలేదు. గ్రామాలకు చేరుకున్న క్రీడా కిట్లు ఎక్కడికి చేరాయో, ప్రస్తుతం ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదు.

ఉపయోగంలోకి తెస్తాం

మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలను పరిశీలించి, వాటి నిర్వహణతో పాటు ప్రజలు, యువకులకు ప్రాంగణాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తాం. వచ్చిన క్రీడా కిట్లను క్రీడాకారులకు అందిస్తాం.

– బ్రహ్మచారి, ఎంపీఓ

కల్వకుర్తిలో అలంకారప్రాయంగా..



ఎంగంపల్లి క్రీడాప్రాంగణంలో పెరిగిన పిచ్చిమొక్కలు

కల్వకుర్తి రూరల్: గ్రామీణ ప్రాంత విద్యార్థులు, యువకులలో క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు లక్ష్యంతో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలు కల్వకుర్తి మండలంలో అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీల పరిధిలో 24 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేశారు. ఒక్కో క్రీడా ప్రాంగణం నిర్మాణానికి రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు ఖర్చు చేశారు. మండలంలోని ఎంగంపల్లి గ్రామంలో పంట పొలం సమీపంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. ఆ ప్రాంగణం పిచ్చి మొక్కలు, గడ్డితో నిండిపోయింది. క్రీడా ప్రాంగణాలలో వ్యాయామం చేసేందుకు పరికరాలు అందుబాటులో కొన్నిచోట్ల లేకుండా పోయాయి. కొన్నిచోట్ల నిరుపయోగంగా మారాయి. కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, లాంగ్ జంప్ కోసం వినియోగించాల్సి ఉండగా చాలాచోట్ల ఖోఖో మాత్రమే ఆడుకునే విధంగా ఆటస్థలం ఉంది. అప్పటి అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరించారని విమర్శలు వినిస్తున్నాయి.

అన్ని సౌకర్యాలు కల్పించాం



మండలంలో అన్ని గ్రామాల్లో క్రీడామైదానాలు ఏర్పాటు చేశాం. క్రీడాకారులకు వసతులు కల్పించాం. క్రీడా మైదానాలను విద్యార్థులు, క్రీడాకారులు వినియోగించుకుంటున్నారు. పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తాం.

– వెంకట రాములు, ఎంపీడీఓ